


'నాయనా! ప్రసాద్! ఇక్కడ సీటు ఖాళీ! రా, కూర్చో!' అన్నాడు పరంధామయ్య. సిటీ బస్సు కిటకిట లాడుతోంది. ఆఫీసులు వదిలి జనాలిళ్ళకు వెళ్ళే వేళ. ఆ జనం సందుల్లోంచి ఎవరో తన్ను చూస్తున్నట్లనిపించింది పరంధామయ్యకు. అంత రద్దీలోను పరకాయించి చూశాడు. పిల్ల తెల్లగా కుందనపు బొమ్మలా ఉంది. చూపుపడి జారిపోయేట్లుంది. ఆ ముక్కైతే తానెక్కడో చూసినట్లుంది – సన్నగా, పొడుగ్గా, కొసదేరి. అంతలో బస్సు కదిలింది. జనమూ కదిలారు. ఆ అందమైన ముక్కు అదృశ్యమై పోయింది.

ముక్కు అనగానే పరంధామయ్యకు ముక్కు తిమ్మన్న గుర్తు వచ్చాడు. తిమ్మన్న ఇంటి పేరు నంది వారు అది ముక్కుగా మారటాని కో కథ. ఓ నాడాయన ఓ అందమైన అమ్మాయి ముక్కు చూశాడట! ఆయనకు గంధఫలి – అంటే సంపెంగ పువ్వు గుర్తు వచ్చింది. అన్ని పూల మీదా వాలి ఆనందించే సారంగం – అంటే తుమ్మెద తన మీదెందుకు వాలదా అని సంపెంగ కోపించి తపస్సు చేసి అందమైన అమ్మాయి ముక్కుగా మారిందట! ఆ అమ్మాయి చూపులు తుమ్మెదల బారులై ఆ ముక్కు రెండు వైపులా ఉన్నట్లనిపించిందా మహాకవికి. అంతే, ఆ ముక్కులా ముద్దు లొలికేటట్లుగా

"నానా సూన వితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాకం దపం బంది, యో
షా నాసాకృతి బూని సర్వ సుమన స్సౌరభ్య సంవాసమై
పూనెన్ ప్రేక్షణ మాలికా మధు కరీ పుంజంబు లిర్వంకలన్"

అంటూ ఓ పద్యం వ్రాశాడట! దాన్ని మెచ్చుకుంటూ వసుచరిత్ర కారుడు, భట్టుమూర్తి ఆ పద్యాన్ని తన కావ్యంలో నిక్షేపించుకొన్నాడట! అందుచేతనే నందితిమ్మన్న గారు ముక్కు తిమ్మన్నగా ప్రసిద్ధి పొందాడట్ల!

ఇది కట్టు కథే కావచ్చు. కాని ఆ పద్యం వ్రాసిన కవి ఇట్లాంటి ముక్కే చూసి ఉంటాడు. ఇంతకూ ఇట్లాంటి ముక్కు తానెక్కడ చూసినట్లు? ఎప్పుడు చూశాడు? ఒక్కసారి పరంధామయ్య మనస్సు మూడు దశాబ్దాల వెనక్కి వెళ్ళిపోయింది. తల్లిదండ్రులతో తాను మొదటి సారి పెళ్ళి చూపులకు వెళ్ళాడు. ఆ అమ్మాయి పని పాటల తీరు విని. అమ్మ మురిసిపోయింది. నాన్న చూపంతా వాళ్ళిచ్చే కట్నం కానుకల మీదే! తనకైతే తిమ్మన్నో, భట్టుమూర్తో వర్ణించిన ముక్కుగల అందాల రాశిని అప్పటికప్పుడే సొంతం చేసుకోవాలనిపించింది. అదంత సులభం కాదు గదా! దానికి ముందు బోలెడంత తంతు. ఆ తంతులో ఆవగింజలో అరవయ్యో వంతు ఈ పెళ్ళి చూపులు!

పిల్ల నచ్చిన వైనం ససేమిరా బైట పెట్ట గూడదన్నాడు తండ్రి. కుక్కిన పేనల్లే కూర్చుండి పోయాడు పరంధామయ్య. జాతకాల ప్రస్తావన వచ్చింది గాని అంతకంటె ప్రమాదమైన కట్నం కానుకల గడబిడలో అది మునిగిపోయింది. తాను చేసేది లేక తల వంచుకొని వార్తాపత్రికలో తల దూర్చాడు.

ఐదు రోజుల పెళ్ళి కావాలంటూ మొదలు పెట్టి కనీసం మూడు రోజులైనా జరగాలన్నాడు తండ్రి. పరంధామయ్య మనస్సులో గొణుక్కొన్నాడు – అలాగున అక్క పెళ్ళి చేశాడా నాన్న? పోనీ, చెల్లాయి పెళ్ళి మూడు పూటలు చేయగలడా? మరి వాళ్ళను ఐదు రోజులు పెళ్ళి చేయమని అడగటంలో సబబేమిటి? ఈలాగున మనసులో గుడుసుళ్ళు పడ్డాడే కాని పైకి ఒక్క నలుసు తేలలేదు తాను. ఆ తండ్రంటే ఇంటిల్లిపాదికీ సింహస్వప్నమే!

చివరికి కాళ్ళావేళ్ళా పడ్డాడు పిల్లతండ్రి కట్నం విషయంలో బెడిసే సరికి. కాని తన తండ్రి కరిగితేనా? వస్తూ వస్తూ పిల్ల తండ్రితో 'మీ పిల్ల మా వాడికి నచ్చ లేదట!' అని చక్కా వచ్చాడు తన తండ్రి. కళ్ళ నీళ్ళ పర్యంతమైంది పరంధామయ్యకు. రత్న దీపం లాంటి ఆ అమ్మాయి తనకు నచ్చలేదని చెప్పగలడా? ఈ మాట వింటే దీపకళిక లాంటి ఆ అమ్మాయి అల్లాడిపోదా?

'ఇక్కడే మనం దిగాలి బాబాయ్!' అంటున్నాడు ప్రసాద్! పరంధామయ్య ఊహా లోకం లోంచి బస్సులోకి వచ్చాడు. లేచి ఆ దిక్కుగా చూచాడు. ముక్కు తిమ్మన్నగారు వర్ణించిన ముక్కుగలమ్మాయి ఎప్పుడో దిగిపోయింది. పరంధామయ్య నీరసంగా బస్సు దిగాడు, పది వేల రూపాయల పర్సు పోయి దిగాలు పడిన వాడి లాగా!

'ఏమైంది బాబాయ్!' అన్నాడు ప్రసాద్. పరంధామయ్య మనస్సులో ముక్కు తిమ్మన వర్ణించిన ముక్కును స్మరించుకొంటూ 'ఏం లేదు నాయనా!' అన్నాడు □